# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రెండు ప్రపంచ రికార్డులను నెలకొల్పి చరిత్ర సృష్టించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చని అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం నిరూపించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ❖ యోగాంధ్ర కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మిరాకిల్ ప్రపంచ రికార్డు సాధించింది.
- ❖ రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=======================

విశాఖపట్నంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రజల సహకారంతో విజయవంతం అయ్యిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం అనంతరం ఆయన విశాఖ కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒకే వేదిక వద్ద 3 లక్షల మందికి పైగా యోగా చేయటం, 22 వేల, 122 మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల పాటు చేసిన సూర్య నమస్కారాలతో రెండు గిన్నీస్ రికార్డులు సొంతం చేసుకుని చరిత్ర సృష్టించామన్నారు. యోగా సాధకులు తెల్లవారు జాము నుండే ఉత్సాహంగా వేదికల వద్దకు చేరుకున్నారని పేర్కొన్నారు. 10 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషి ఫలించిందని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 170 దేశాల్లో యోగాను ఆచరిస్తున్నారని చెప్పారు. ఈరోజు ఒక్కరోజే ప్రపంచ వ్యాప్తంగా 12 లక్షల చోట్ల 10 కోట్ల మంది ప్రజలు యోగాలో భాగస్వాములయ్యారని అన్నారు. యోగా ప్రతీ ఒక్కరికీ అవసరమే అనే భావనను ప్రధానమంత్రి తీసుకొచ్చారని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 10 సెకన్లు)

=======================

సంకల్ప బలం, ప్రణాళికా సామర్థ్యం, పర్యవేక్షణా పటిమ ఉంటే ఏదైనా సాధించవచ్చని విశాఖ వేదికగా జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం నిరూపించిందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అంర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొంటూ.. మంచి ఉద్దేశ్యంతో పాలకులు తీసుకునే నిర్ణయాలకు ప్రజల మద్దతు లభిస్తుందని రుజువైందన్నారు. దేశ, విదేశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జూన్ 21వ తేదీన తన విశిష్టతను చాటుకుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఘన విజయాన్ని సాధించడం అద్భుతమని వ్యాఖ్యానించారు. యోగాకు అంతర్జాతీయ ప్రాచుర్యాన్ని కల్పించి, ప్రజలను భాగస్వాములను చేసి, ఒక ఉద్యమాన్నే నిర్మించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

=======================

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో రికార్డు స్థాయిలో 18 వేల 662 మంది విద్యార్థులు యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీని ఫలితంగా మిరాకిల్ వరల్డ్ రికార్డ్ దక్కిందని ఆమె పేర్కొన్నారు. యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ లో ఈరోజు జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, నన్నయ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో మే 21 నుండి జూన్ 21 వరకు వివిధ యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలందరి ఆరోగ్యం, ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ యోగా చేసే విధంగా చర్యలు తీసుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

=======================

పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం అనంతరం ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే “స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర” కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన “హరిత యోగా” కార్యక్రమంలో భాగంగా ఆమె రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణతో కలిసి మొక్కలను పంపిణీ చేసారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, ప్రజలకు 9 వేలకు పైగా మొక్కలను ఉచితంగా పంపిణీ చేసారు.

విరామం

=======================

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సర్వం సిద్ధం చేశామని శ్రీకాకుళం ప్రభుత్వ పోలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గురుబిల్లి దామోదరరావు చెప్పారు. కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలింగ్ లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 27వ తేదీ వరకు ప్రోసెసింగ్ రుసుం చెల్లించవచ్చని తెలిపారు. వివిధ బ్రాంచుల ఎంపికకు సంబంధించి ఈ నెల 25 నుండి 30వ తేదీ వరకు ఐచ్ఛికాల ఎంపిక ఉంటుందని, ఈ విషయంలో విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏ ర్యాంక్ వారికి ఏ రోజు కౌన్సిలింగ్ జరుగుతుందో ముందుగా చెబుతామని.. ఎవరికైనా సందేహం ఉంటే హెల్ప్ లైన్ కేంద్రాలను సంప్రదించాలని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 5 ప్రభుత్వ.. 4 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో సుమారు 2 వేల 500 సీట్లు ఉన్నాయన్నారు. గత సంవత్సరం పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు నూరుశాతం ఉపాధి అవకాశాలు కలిగాయని పేర్కొన్నారు.

=======================

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు.. పల్నాడు జిల్లా అమరావతిలో చారిత్రక బౌద్ధ స్థూపం వద్ద జరిగిన యోగాదినోత్సవంలో పాల్గొన్నారు. 2 వేల మందితో నిర్వహించిన ఈ సామూహిక యోగా కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆధునిక కాలంలో మానసిక ప్రశాంతత లేకపోవడం, మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధ వ్యాధులు తీవ్ర సమస్యలుగా మారాయన్నారు. మానసిక ప్రశాంతతకు, శారీరక

ఆరోగ్యానికి యోగా సరైన మార్గం అని తెలిపారు. భారతదేశంలో పుట్టిన యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా రికార్డు స్థాయిలో వేడుకలు నిర్వహించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంతోనే సాధ్యమైందని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్‌లో ఈరోజు "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ నెలలో మూడవ శనివారం సందర్భంగా ఈరోజు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛత ఆవశ్యకతను, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం స్వచ్ఛత పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించడానికి, పచ్చదనాన్ని ప్రోత్సహించడానికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

=======================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వీటి ఫలితంగా రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు  లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని చెప్పారు.  ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారి  పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================
=======================